గణితశాస్త్ర మాంత్రికుడు శ్రీనివాస రామానుజన్‌


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

చంపాపేట: ప్రపంచ గణితశాస్త్ర మాంత్రికుడు శ్రీనివాస రామానుజన్‌ అని విద్యావేత్త, విశ్రాంత ఉపాధ్యాయుడు లెక్కల కృష్ణారెడ్డి అన్నారు. రామానుజన్‌ జయంతి సదర్భంగా ఆదివారం చంపాపేట డివిజన్‌ కర్మన్‌ఘాట్‌ శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీనివాస రామానుజాన్‌ తన 19 ఏళ్ల ప్రాయంలోనే గణితశాస్త్రంలోని సంఖ్యా సిద్ధాంతాలు, అనంత, మిశ్రమ శ్రేణి అంశాల్లో 3098 సిద్ధాంతాలు, సూత్రాలను రూపకల్పన చేసి ప్రపంచ గణిత శాస్త్రవేత్తలలో అగ్ర స్థానం దక్కించుకున్నాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణిత, వైజ్ఞానిక శాస్త్రంపై పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్‌ లలితారెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు నర్సింహా, అనిత, అవీనా, గీతాంజలి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ ఎజెండా


పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

హయత్‌నగర్‌ : పేద ప్రజల సమస్యల పరిష్కారమే ఎజెండాగా వందేళ్లుగా పని చేస్తున్న పార్టీ సీపీఐ ఒక్కటే అని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవింద్రాచారి అన్నారు. ఈ నెల 26న జరిగే పార్టీ శత జయంతి ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం హయత్‌నగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో సామాన్యుడి హక్కుల రక్షణ కోసం, సమసమాజ నిర్మాణం కోసం, సోషలిజం స్థాపనే లక్ష్యంగా పార్టీ అహర్నిశలు పని చేస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అనేక మంది పార్టీ కార్యకర్తలు త్యాగాలు చేశారని పేర్కొన్నారు. ఈ నెల 26న జరిగే పార్టీ శత జయంతి ఉత్సవాల్లో పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, శ్రీదేవి, శోభన్‌, సక్రూ, వంశివర్ధన్‌రెడ్డి, నాగరాజు, వెంకట్‌, పారిజాత, అనాత, సౌజన్య, జ్యోతి, సుమతి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన


నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

వనస్థలిపురం: వనస్థలిపురంలోని బచ్‌పన్‌, అకడమిక్‌ హైట్స్‌ పబ్లిక్‌ స్కూల్లో రెండ్రోజులుగా కొనసాగుతున్న విజ్ఞాన ప్రదర్శన అలరించింది. ప్రదర్శనకు ముఖ్య అతిథిగా హాజరైన రీజినల్‌ డైరెక్టర్‌ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు విజ్ఞాన ప్రదర్శనలు దోహదపడుతాయన్నారు.ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కోఆర్డినేటర్‌ సునీత శ్రీనివాస్‌, ప్రిన్సిపల్‌ కల్పవల్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీవీరావు, వెంకటస్వామిలకు నివాళి

మన్సూరాబాద్‌: మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొంగరి నర్సింహారావు ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని డా. అంబేడ్కర్‌ విగ్రహం వద్ద పీవీరావు, గడ్డం వెంకటస్వామి వర్ధంతి నిర్వహించి చిత్రపటాలకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ను అగౌరవపరచిన అమిత్‌షాను బర్తరఫ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. కాశీనాథ్‌, నీలం కృష్ణ, పెరుమాళ్ల శంకరయ్య, నాగమల్ల బిక్షపతి, బీఎల్‌ జగన్‌, సోల్లు శ్రీనివాస్‌, శ్రీధర్‌, నర్సింహ్మా, సతీష్‌, రవీందర్‌, జనార్దన్‌ పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న మాల మహానాడు నేతలు

అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్‌ చేయాలి


అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

మన్సూరాబాద్‌: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్రమంత్రి అమిత్‌షాను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్‌ చేయాలని సోషల్‌ జస్టిస్‌ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు డిమాండ్‌ చేశారు. ఎల్‌బీనగర్‌లోని అంబేడ్కర్‌ విగ్రహానికి ఆదివారం పాలాభిషేకం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంతోనే కేంద్ర హోంమంత్రి పదవిలో కొనసాగుతున్న అమిత్‌షా అగ్రకుల ఆదిపత్య అహంకారంతో అంబేడ్కర్‌ను అవమానపర్చారని విమర్శించారు. అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించకుంటే అన్ని వర్గాలు ఏకమై దేశవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కేవీ.గౌడ్‌, కొండల్‌గౌడ్‌, బాలస్వామి, గోరశ్యాంసుందర్‌ పాల్గొన్నారు.

దివ్యాంగుల క్రీడలకు ప్రోత్సాహం అందిస్తా


విజేత జట్టుతో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మన్సూరాబాద్‌: ఇటీవల మధ్యప్రదేశ్‌ భోపాల్‌లో జరిగిన జాతీయ స్థాయి ఉమాంగ్‌ గౌరవదీప్‌ నేషనల్‌ వీల్‌చైర్‌ క్రికెట్‌ పోటీల్లో తెలంగాణ జట్టు ట్రోఫీ సాధించడం అభినందనీయమని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. విజేత జట్టు ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆమెను కలువగా వారిని అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివ్యాంగుల క్రీడలకు ప్రోత్సాహం అందిస్తానని తెలంగాణ, కేరళ, హరియాణ, చత్తీస్‌ఘడ్‌, మధ్యప్రదేశ్‌, జమ్ముకశ్మీర్‌ రాష్ట్రాలతో పోటీపడి రాష్ట్రానికి ట్రోఫీని సాధించడం సంతోషకరమన్నారు. జట్టు సభ్యులందరికి వ్యక్తిగతంగా ప్రత్యేకంగా కిట్‌లను అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జట్టు కెప్టెన్‌ ఆర్‌. కోటేశ్వర్‌, వైస్‌ కెప్టెన్‌ ధరావత్‌ సురేష్‌, సభ్యులు రామకృష, రవి, మహేష్‌, శ్రీను, గుండ్యానాయక్‌ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

హయత్‌నగర్‌ : బుడగ జంగాల హక్కుల పోరాట సమితి హయత్‌నగర్‌ డివిజన్‌ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తూర్పాటి పెద్దకోటయ్య, ఉపాధ్యక్షులుగా కొడిగంటి విష్ణు, దుదుర్కి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా మోతె వెంకటేష్‌, కార్యదర్శిగా కొడిగంటి కురుమయ్య, సహాయ కార్యదర్శిగా కొడిగంటి కృష్ణా, కోశాధికారిగా మోతె శ్రీను ఎన్నికయ్యారు,



సందడిగా సెమీ క్రిస్మస్‌

మలక్‌పేట: అక్బర్‌బాగ్‌ ప్రొఫెసర్స్‌ కాలనీలోని సెయింట్‌ జేవీయర్స్‌ హైస్కూల్లో క్రిస్మస్‌ సంబరాలు సందడిగా నిర్వహించారు. శాంతాక్లాజ్‌, మేరీమాత, ఏంజెల్స్‌ వేషధారణలో చిన్నారి విద్యార్థులు సందడి చేశారు. యేసు జననంపై విద్యార్థుల నాటక ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. సంబరాల్లో పాల్గొన్న కరస్పాండెంట్‌ జి. హిజ్కియా విద్యార్థులు, ఉపాధ్యాయులకు క్రిస్మస్‌ గిఫ్ట్స్‌ పంపిణీ చేశారు.

అంగన్‌వాడీ.. అమ్మ ఒడి

- చిన్నారులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందచేత


అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతం చేస్తున్న దృశ్యం

చంపాపేట: చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో పోషక లోపాన్ని గుర్తించి భవిష్యత్‌లో వారిలో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం పౌష్టికాహారం అందించేందుకు నడుం బిగించింది. దీంట్లో భాగంగా అంగన్‌వాడీ సిబ్బంది బస్తీలలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఏఎస్‌ఎంల ద్వారా గర్భిణుల వివరాలు సేకరించి వారి ఇంటికి వెళ్లి గర్భం దాల్చిన ప్పటి నుంచి ప్రసవం అయ్యే వరకు ఎలాంటి పోషకాహారం తీసుకోవాలి.. జాగ్రత్తలు పాటించాలనే విషయంపై అంగన్‌వాడీ కేంద్రాల్లో నిపుణులతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. అంగన్‌వాడీ సెంటర్ల టీచర్లు, సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ గర్భిణులు, బాలింతలు, అతి తక్కువ బరువుతో జన్మించిన నవజాత శిశువు వంటి వివరాలు సేకరించి వారికి పోషక ఆహార నియమాలపై అవగాహన కల్పించటంతో పాటు సూచనలు ఇస్తూ శిశు మరణాల కట్టడికి శ్రమిస్తున్నారు.

ఆరు కేంద్రాలు...

చంపాపేట డివిజన్‌ పరిధిలోని కర్మన్‌ఘాట్‌, చంపాపేట, బైరామల్‌గూడ ప్రాంతాల్లో మొత్తం ఆరు అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటిలో ఐదు కేంద్రాలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ఖాళీ గదుల్లో కొనసాగుతుండగా బైరామల్‌గూడలోని ఓ కేంద్రం మాత్రం అద్దె భవనంలో నడుస్తుంది. డివిజన్‌ పరిధిలోని ఆరు అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు 128 మంది నమోదు కాగా అందులో 75 మంది అంగన్‌వాడీ సెంటర్‌లో పోషక ఆహారం తీసుకుంటున్నారు. బాలింతలు 130 మంది ఉండగా 63 మంది సెంటర్‌కు హాజరవుతున్నారు. ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల చిన్నారులు 618 మంది ఉండగా పోషకాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రాలకు 452 మంది మాత్రమే హాజరవుతున్నారు. మూడు సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాల ప్రాయం గల చిన్నారులు 252 మందిని ఉండగా సెంటర్‌ లకు 163 మంది హాజరవుతున్నారు. అతి తక్కు వ, సాధారణ బరువు ఉన్నా చిన్నారులు 22 మందిని నమోదు చేసి వారికి ప్రత్యేకంగా తయారు చేసిన బాలామృతాన్ని అందజేస్తున్నారు.

అంగన్‌వాడీల్లో ఇచ్చే పోషకాహారం

- **గర్భిణులు, బాలింతలకు:** ప్రతిరోజు 150 గ్రా. అన్నం, 30 గ్రా. పప్పు, 16 గ్రా. నూనె, 200 గ్రా. పాలు, ఒక గుడ్డు, సాంబారు, పెరుగును అందిస్తున్నారు.
- **03–06 ఏళ్ల పిల్లలకు:** 75 గ్రా. అన్నం, 15 గ్రా. పప్పు, 5 గ్రా. నూనె. ఒక గుడ్డు, 20 గ్రా. కుర్‌కురే ఇస్తున్నారు.
- **07– నెలల నుంచి మూడేళ్ల చిన్నారులకు:** నెలకు బాలామృతం మూడు కేజీలు, 16 గుడ్లు, అందిస్తున్నారు. అతి తక్కువ, తక్కువ, సాధారణ బరువుతో జన్మించిన శిశువులకు ప్రత్యేక పౌష్టికాహారాన్ని అందిస్తూ అంగన్‌వాడీ అమ్మ ఒడే అని నిరూపిస్తున్నారు.

బాలామృతం జీవామృతం



అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే బాలామృతంలో బీ–12, బీ–2, బి1, ఏ– విటమిన్‌, ఇనుము, క్యాల్షియం వంటి ఎన్నో పోషక విలువలు ఉన్న బాలామృతం జీవామృతం లాంటిది. బాలింతలు, చిన్నారులకు నచ్చ చెప్పి సెంటర్‌కు రప్పించి బాలామృతంతో పాటు గుడ్లు, పోషక విలువలతో కూడిన వండిన ఆహారాన్ని అందిస్తున్నాం. బాలామృతం క్రమం తప్పకుండా వాడాలని త్వరగా జీర్ణమవుతుందని అవగాహన కల్పిస్తున్నాం.

–శ్రీలత, శుభోదయ కాలనీ, అంగన్‌వాడీ టీచర్‌

నవజాత శిశువులపై ప్రత్యేక శ్రద్ధ..



కేంద్రంలో అక్షరాభ్యాసాలు, సీమంతాలతో పాటు పలు పర్వదిన వేడుకలు నిర్వహిస్తుండటంతో అమ్మ ఒడిని తలపిస్తుంది. నవజాత శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గర్భిణుల్లో రక్తహీనత గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. తక్కువ బరువుతో జన్మించిన నవజాత శిశువులపై ప్రత్యేక శ్రద్ధ వహించి శిశు మరణాలు లేకుండా రోగ నిరోధక శక్తిని పెంపొందించేందుకు పోషకాహారాన్ని అందిస్తున్నారు.

–సరస్వతి, గర్భిణి కర్మన్‌ఘాట్‌

బాలామృతం ఔషధంలా పని చేస్తోంది..



గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు వివరిస్తూ పౌష్టిక ఆహారాన్ని ఇస్తున్నారు. రక్తహీనతను గుర్తించి అవసరమైతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపిస్తున్నారు. సరైన మోతాదులో పాలు, గుడ్లు, బాలామృతం వాడాల్సిందిగా సూచిస్తున్నారు.

–ఎన్‌. స్వప్న గర్భిణి, శుభోదయ కాలనీ

నేడు డయల్‌ యువర్‌ డీఎం

నాగోలు: ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం బండ్లగూడ డిపోలో సోమవారం డయల్‌ యువర్‌ డీఎం నిర్వహిస్తున్నట్లు బండ్లగూడ మేనేజర్‌ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్యలో ఆర్టీసీ బస్సుల నిర్వహణ, ప్రయాణికుల ఇబ్బందులు ఇతర అంశాలకు 9959224058 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

దిల్‌సుఖ్‌నగర్‌ డిపోలో..

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌ సిటీడిపో నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల సలహాలు, సమస్యలు, స్వీకరించేందుకు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్‌ యువర్‌ డీఎం నిర్వహిస్తున్నట్లు మేనేజర్‌ టి. సమత తెలిపారు. ప్రయాణికులు నేరుగా డీఎంతో మాట్లాడేందుకు 9959226137 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

దుప్పట్ల అందజేత

మన్సూరాబాద్‌: దిల్‌సుఖ్‌నగర్‌, ఎల్‌బీనగర్‌, మన్సూరాబాద్‌, వనస్థలిపురం, నాగోలు, మలక్‌పేట, కోఠి, అబిడ్స్‌ తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న వారికి గిన్నిస్‌ వరల్డ్‌ రికార్డ్‌ హోల్డర్‌, సోషల్‌ వర్కర్‌ డా. పెండెం కృష్ణకుమార్‌ దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాత్రి రోడ్లపై నిద్రిస్తున్న వారికి ప్రతి ఏడాది చలికాలంలో దుప్పట్లు అందజేస్తానన్నారు.

గ్యాస్‌ రీఫిల్లింగ్‌ కేంద్రంపై దాడి

19 సిలిండర్లు స్వాధీనం

సైదాబాద్‌: గ్యాస్‌ రీఫిల్లింగ్‌ చేస్తున్న కేంద్రంపై అధికారులు దాడిచేసిన ఘటన సైదాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సింగరేణి కాలనీలో నివసించే ఆటోడ్రైవర్‌ సభావత్‌ చక్రినాయక్‌ తన ఇంటి వద్ద అక్రమంగా గ్యాస్‌ రీఫిల్లింగ్‌ కిట్ల సహాయంతో డొమెస్టిక్‌ సిలిండర్ల నుంచి కమర్షియల్‌ సిలిండర్లలోకి గ్యాస్‌ నింపి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న సివిల్‌ సప్లై అధికారులు తమ సిబ్బందితో శనివారం సాయంత్రం కేంద్రంపై దాడిచేసి 19 సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు.

కామినేనిలో అరుదైన శస్త్ర చికిత్స

మన్సూరాబాద్‌: సంక్లిష్టమైన శస్త్ర చికిత్సతో ఓ వ్యక్తికి నూతన జీవితాన్ని అందించారు కామినేని వైద్యులు. ఆదివారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు వివరాలు వెల్లడించారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ యువకుడు హయత్‌నగర్‌లో రోడ్డు దాటుతుండగా రాంగ్‌రూట్‌లో వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమీపంలోని ఓ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆ తర్వాత మరో ఆస్పత్రికి తీసుకెళ్లగా బతకడం కష్టమని తేల్చి చెప్పారు. మెరుగైన వైద్యం కోసం కామినేని ఆస్పత్రికి తీసుకురాగా సుమారు ఆరు నెలల పాటు చికిత్స అందించగా కోలుకున్నాడన్నారు. అత్యంత క్లిష్టమైన కేసులో న్యూరోసర్జన్‌, కార్డియోథెరాసిక్‌ సర్జన్‌, క్రిటికల్‌ కేర్‌ విభాగాలతో పాటు ఫిజియోథెరపీ విభాగం వైద్యులు కృషిచేసి ఆ వ్యక్తికి నూతన జీవితాన్ని అందించామన్నారు.

మహాసభకు తరలిన బంజారా మహిళలు


సంప్రదాయ దుస్తుల్లో మహాసభకు వెళ్తున్న మహిళలు

సైదాబాద్‌: బంజారాల అభివృద్ధి, వారి సమస్యల పరిష్కారానికి సేవాలాల్‌ బంజారా సంఘం నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సక్రిబాయి అన్నారు. సేవాలాల్‌ బంజారా సంఘం పదవ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మహాసభకు ఐఎస్‌సదన్‌ డివిజన్‌ పరిధి సింగరేణి కాలనీ నుంచి సక్రిబాయి ఆధ్వర్యంలో సంప్రదాయ దుస్తులు ధరించి, తలపై బిందెలతో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి కోసం నగరాలకు వచ్చి జీవిస్తున్నా తమ సంప్రదాయాలను మాత్రం పాటిస్తూనే ఉంటామన్నారు. సేవాలాల్‌ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్‌ నాయక్‌ ఆధ్వర్యంలో బంజారాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

ప్రతి కాలనీలో వసతుల కల్పనకు కృషి


పనులకు శంకుస్థాపన చేస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్‌: డివిజన్‌ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డి నగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.ఎన్‌జీఓఎస్‌ కాలనీలో రూ.78 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు ఆదివారం ఆయన కాలనీవాసులతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. కాలనీలలో సమస్యలను తన దృష్టికి తీసుకు రావాలని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌ రావు, వెంకటేశ్వర్లు, సోమయాజులు, శ్యాంకుమార్‌, ఆనంద్‌ పాల్గొన్నారు.

నాటి వీరనారీల స్ఫూర్తితో ముందుకు సాగాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సునీతారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్‌: నేటితరం యువతులు చదువు, ఉద్యోగాలతో పాటు నాటి వీరవనితల పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని విశ్వహిందూ పరిషత్‌ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సునీతారెడ్డి అన్నారు. వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయం సమీపంలో విశ్వ హిందూ పరిషత్‌ యువతి విభాగం దుర్గావాహిని సమావేశం ఆదివారం నిర్వహించారు. అంతకుముందు అష్టలక్ష్మి దేవాలయం పరిసర ప్రాంతం మొదలుకొని చైతన్యపురి, కొత్తపేట, విక్టోరియా మెమోరియల్‌ మెట్రో స్టేషన్‌ తదితర ప్రాంతాల్లో 1500 మంది దుర్గావాహిని యువతులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ.. నేటి యువతులు ఆధునికత పేరుతో అస్తవ్యస్తమైన జీవన విధానాన్ని అవలంబించడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం, ధర్మం, సమాజం పట్ల బాధ్యత కలిగి జీవించాలని సూచించారు. దుర్గావాహిని రాష్ట్ర కన్వీనర్‌ వాణి సక్కుబాయి మాట్లాడుతూ.. మాతృవందన కార్యక్రమం పేరుతో నాటి వీర వనితల స్ఫూర్తిని స్మరించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో భోజన పల్లి నరసింహమూర్తి, లక్ష్మీనారాయణ, సురేందర్‌ రెడ్డి , శశిధర్‌, సింధుజ, మాధవి, ఉమారాణి, శిరీష, నిఖిల, సంకల్ప, భవాని, మీనా, లత శ్రీ , జ్యోతి, లక్ష్మి పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న యువతులు

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్‌, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాట రూ. 15, వంకాయ రూ. 35, బెండ రూ. 45, పచ్చిమిర్చి రూ. 33, కాకర రూ. 35, బీర రూ. 55, క్యాబేజి రూ. 18, ఫ్రెంచిబీన్స్‌ రూ. 50, క్యారట్‌ రూ. 28, దొండ రూ. 45, చిక్కుడు రూ. 45, గోకర రూ. 28, బీట్‌రూట్‌ రూ. 43, క్యాప్సికం రూ. 50, ఆలు రూ. 25, దోస రూ. 15, సొరకాయ రూ. 13, పొట్లకాయ రూ. 18, ఉల్లిగడ్డ రూ. 35, చామగడ్డ రూ. 37. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సన్మానం



సైదాబాద్‌: రాజ్యసభ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన ఆర్‌.కృష్ణయ్యను ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్‌ మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.

కష్టపడే కార్యకర్తలకు కాంగ్రెస్‌లోనే గుర్తింపు


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నగారిగారి దాస్‌

సైదాబాద్‌: పార్టీ పటిష్టత కోసం కష్టపడే కార్యకర్తలకు కాంగ్రెస్‌లో తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని ఐఎస్‌సదన్‌ డివిజన్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు నగారిగారి దాస్‌ అన్నారు. హైదరాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌ వైస్‌ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కోట్ల శ్రీనివాస్‌ను ఆదివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కోట్ల శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శశియాదవ్‌, కోట్ల లడ్డూపటేల్‌, గని, శ్రీను పాల్గొన్నారు.

రహదారుల ఆధునీకరణకు కృషి


పనులు ప్రారంభించిన కార్పొరేటర్‌ అరుణ

సైదాబాద్‌: డివిజన్‌ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీలు, బస్తీల్లోని అంతర్గత రహదారుల ఆధునీకరణకు కృషి చేస్తున్నామని సైదాబాద్‌ కార్పొరేటర్‌ అరుణ తెలిపారు. ఎస్‌బీహెచ్‌–సీ కాలనీలో రామ్‌ రెసిడెన్సీ నుంచి మూన్‌స్టార్‌ స్కూల్‌ వరకు ఆదివారం ఆమె సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. సైదాబాద్‌ డివిజన్‌ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రాజ్‌కుమార్‌, కాలనీసభ్యులు ఎంఎన్‌ చారి, రవీందర్‌, నీరజ, సుస్మిత, మమత, రాజారాం, సుభాష్‌, రవి పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి

నాగోలు: కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని కొత్తపేట డివిజన్‌ కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌కుమార్‌ అన్నారు. బాలాజీనగర్‌ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వైష్ణవి ప్రసాద్‌ తల్లిదండ్రులు సూర్యకాంతం– శ్రీ రామకృష్ణ శర్మ జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన కాలనీ ముఖ ద్వారాన్ని ఆదివారం కార్పొరేటర్‌ ప్రారంభించి మాట్లాడారు. బాలాజీనగర్‌ కాలనీని రాబోయే రోజుల్లో మరింతా అభివృద్ధి పథంలో తీసుకెళ్తానన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్‌గౌడ్‌, గోపాల కిషన్‌, వైష్ణవి ప్రసాద్‌, కుమారస్వామి, పాండుగౌడ్‌, అరవింద్‌ కుమార్‌, ప్రసాద్‌, నరేందర్‌, వనజ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



నాగోలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని చైతన్యపురి ఇన్‌స్పెక్టర్‌ వెంకటేశ్వరరావు అన్నారు. కొత్తపేటలోని బచ్‌పన్‌–అకాడమిక్‌ హైట్స్‌ పబ్లిక్‌ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన క్రీడోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. చదువు మన మేధస్సు పెంచుతుందని క్రీడలు మన శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్‌ జితేంద్రదేవి, పాఠశాల ఇన్‌చార్జి స్వీటీ పాల్గొన్నారు.